నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, మంగళవారం 30 ఏప్రిల్ 2024 | HYDERABAD


కేటీఆర్, ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మాజీ మేయర్ మహేందర్ గౌడ్, కార్పొరేటర్లు

బీఆర్ఎస్‌లోకి మాజీ మేయర్ మహేందర్ గౌడ్

బండ్లగూడ, ఏప్రిల్ 29: బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపునకు అందరూ కలిసి కట్టుగా పని చేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ మహేందర్ గౌడ్, కార్పొరేటర్లు పద్మావతి పాపయ్య యాదవ్, సాగర్ గౌడ్, శ్రీలతా సురేశ్ గౌడ్ తదితరులు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ఆధ్వర్యంలో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నరేశ్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలతో కాంగ్రెస్ మోసం

కంటోన్మెంట్, ఏప్రిల్ 29: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని చెప్పి.. కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత మండిపడ్డారు. కంటోన్మెంట్ రెండో వార్డు పరిధిలోని పలు బస్తీల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నివేదిత మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే వ్యతిరేకత మొదలైందని, ఆ పార్టీ నాయకుల మాటలు ప్రజలు నమ్మట్లేదన్నారు. వారి పాలనలో ప్రజలకు కష్టాలు తప్ప, అభివృద్ధి శూన్యమన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

వృద్ధురాలికి కరపత్రం అందజేసి ఓటు అభ్యర్థిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత

నీళ్లు.. కరెంటు కొరత

ఒకటో తేదీ నుంచి ఓయూకు సెలవులు

- ఉస్మానియా యూనివర్సిటీ చీఫ్ వార్డెన్ నోటీస్ జారీ
- రాష్ట్రంలో వాస్తవ పరిస్థితులకు ఇదే నిదర్శనమంటూ కేసీఆర్ ఎక్స్‌లో ట్వీట్
- నాలుగు నెలలుగా ప్రభుత్వం ప్రజల్ని తప్పదోవ పట్టిస్తుందని ఆగ్రహం
- కేసీఆర్ ట్వీట్‌తో ఒక్కసారిగా ఉలిక్కిపడిన రాష్ట్ర ప్రభుత్వం
- 2 రోజుల కిందటే నీటి కొరతపై విద్యార్థినుల నిరసన
- చీఫ్ వార్డెన్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసిన ఓయూ రిజిస్ట్రార్
- ప్రజల్ని తప్పదోవ పట్టించేలా నోటీసు ఉందన్న విద్యుత్ శాఖ అధికారులు
- కొరత అవాస్తవమంటూ ప్రకటన విడుదల చేసిన డిప్యూటీ సీఎం భట్టి

ఓయూలో తాగునీటి కోసం నిరసన చేస్తున్న విద్యార్థులు

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ)/ఉస్మానియా యూనివర్సిటీ: 'యూనివర్సిటీలోని బోర్డర్స్‌కు వచ్చే నెల ఒకటో తేదీ నుంచి 31 వరకు సెలవులు ప్రకటించడం జరిగింది. ముఖ్యంగా ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటంతో పాటు తీవ్ర నీటి, కరెంటు కొరత ఉంది. బోర్డర్స్ అందరూ సహకరించాలి.. ఇదీ... ఉస్మానియా యూనివర్సిటీ చీఫ్ వార్డెన్ జారీ చేసిన నోటీసు. ప్రస్తుతం ఇది రాష్ట్రవ్యాప్తంగా పెద్ద దుమారమే రేపింది. తెలంగాణలో నెలకొన్న కరెంటు, తాగు, సాగునీటి కొరతకు చీఫ్ వార్డెన్ జారీ చేసిన నోటీసు నిదర్శనమంటూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. గత నాలుగు నెలలుగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని, కానీ వాస్తవంగా రాష్ట్రంలో కొరతలు, కోతలు ఉన్నది నిజమేనని స్పష్టం చేశారు. కేసీఆర్ ట్వీట్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మొదలు ఉస్మానియా యూనివర్సిటీ, విద్యుత్ శాఖ, జలమండలి అధికారులంతా అప్రమత్తమయ్యారు. ఎలాంటి కొరతలు లేవంటూ వరుసగా పత్రికా ప్రకటనలు విడుదల చేశారు. చివరకు భట్టి కూడా ఇదంతా అవాస్తవమంటూ ప్రకటించారు. ఈ నేపథ్యంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ చీఫ్ వార్డెన్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు.

వరుస ఘటనలతో విద్యార్థుల్లో పెల్లుబికిన ఆగ్రహం..

వాస్తవానికి ప్రతి ఏటా సెలవులు ప్రకటిస్తూ చీఫ్ వార్డెన్ నోటీసు జారీ చేయడం సాధారణమే. కాకపోతే తీవ్ర నీటి, కరెంటు కొరత ఉందని చీఫ్ వార్డెన్ అందులో ప్రస్తావించడం వివాదాస్పదంగా మారింది. రెండు రోజుల కిందట లేడీస్ హాస్టల్ విద్యార్థినులు తమకు వారం రోజులుగా మంచినీటి సరఫరా లేదని, అందరికీ ఒక్క ట్యాంకర్ ఇస్తే దానికి పూజ చేయాలా? అంటూ మండిపడుతూ రాస్తారోకో నిర్వహించారు. ఈ నేపథ్యంలో చీఫ్ వార్డెన్ నోటీసు జారీ చేయడంతో విద్యార్థులను తీవ్ర ఆగ్రహానికి గురి చేసింది. యూనివర్సిటీ చరిత్రలో ఏనాడూ నీరు, విద్యుత్ ఎద్దడి నేపథ్యంలో సెలవులు ప్రకటించలేదన్నారు. తెలంగాణ ఏర్పాటైన తరువాత రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్‌కు అంతరాయం లేకుండా సరఫరా ఉండేదని, తాగునీరు, సాగునీటికి సైతం ఇబ్బంది కలుగలేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే పరిస్థితి ఘోరంగా తయారైందని వాపోయారు. మరోవైపు మానేరు హాస్టల్‌లో తాగునీటి శుద్ధి ప్లాంటు పాడవడంతో విద్యార్థులు తాగునీటి కోసం చీఫ్ వార్డెన్ కార్యాలయంలో సోమవారం ఆందోళన నిర్వహించారు. ఆర్‌వో ప్లాంటును వెంటనే పునరుద్ధరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఇలా వరుస పరిణామాలు చోటుచేసుకోవడంతో యూనివర్సిటీ విద్యార్థులు అటు యూనివర్సిటీ అధికార యంత్రాంగం, ప్రభుత్వంపై మండిపడ్డారు.

చీఫ్ వార్డెన్‌కు షోకాజ్ నోటీసు జారీ..

యూనివర్సిటీలో నీరు, కరెంటు కొరత విషయం అధికారికంగా వెల్లడి కావడంతో ప్రభుత్వం యూనివర్సిటీ అధికారులపై సీరియస్ అయినట్లుగా తెలిసింది. దీంతో యూనివర్సిటీ రిజిస్ట్రార్ పి.లక్ష్మీనారాయణ వెంటనే చీఫ్ వార్డెన్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. సదరు నోటీసులో అనవసరమైన, తప్పుదోవ పట్టించే అంశాలను పేర్కొన్నట్లు అందులో ప్రస్తావించారు. వాస్తవానికి ఎలాంటి నీటి, కరెంటు కొరత లేదని, కానీ చీఫ్ వార్డెన్ తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ అయోమయాన్ని సృష్టించారన్నారు. వెంటనే చీఫ్ వార్డెన్ హేతుబద్ధమైన సంజాయిషీ ఇవ్వాలని, నిర్ణీత సమయంలో సంజాయిషీ ఇవ్వకపోతే క్రమశిక్షణాపరమైన చర్యలు తీసుకుంటామని షోకాజ్ నోటీసులో స్పష్టం చేశారు. కాగా ఇదే సమయంలో విద్యుత్ శాఖ అధికారులు కూడా స్పందించారు. సికింద్రాబాద్ ఎస్ఈ, డీఈ కూడా వేర్వేరుగా పత్రికా ప్రకటనలు విడుదల చేశారు. యూనివర్సిటీలో ఎలాంటి కరెంటు కోతలు లేవని, 33/11 కేవీ సబ్ స్టేషన్ నుంచి రెండు 11కేవీ ఫీడర్స్ ద్వారా నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామన్నారు. చీఫ్ వార్డెన్ జారీ చేసిన నోటీసులో పేర్కొన్నట్లు ఎలాంటి కరెంటు కోతలు లేవని చెప్పారు. మరోవైపు జలమండలి అధికారులు కూడా పత్రికా ప్రకటన విడుదల చేస్తూ.. యూనివర్సిటీతో ఒప్పందం మేరకు రోజుకు 505 కిలో లీటర్ల మంచినీటిని సరఫరా చేయాల్సి ఉండగా.. అంతకుమించి రోజుకు 1271 కిలో లీటర్లు సరఫరా చేస్తున్నామని జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

కేసీఆర్ ట్వీట్‌తోగానీ మేల్కొనని సర్కారు..

యూనివర్సిటీ హాస్టల్స్ (మెస్‌లు) చీఫ్ వార్డెన్ జారీ చేసిన నోటీసును జత చేస్తూ తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. 'గత నాలుగు నెలలుగా తెలంగాణలో కరెంటు, తాగు, సాగునీటి సరఫరాల్లో సీఎం, డిప్యూటీ సీఎం ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. తెలంగాణలో కరెంటు, తాగు, సాగునీటి కొరత ఉందనేది వాస్తవం' అని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ఈ పోస్టు వైరల్‌గా మారింది. అప్పుడుగానీ రాష్ట్ర ప్రభుత్వం మేల్కొనలేదు. ఒక్కసారిగా ఉలిక్కిపడిన సర్కారు దిద్దుబాటు చర్యలు మొదలుపెట్టింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మొదలు అధికార యంత్రాంగం ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. తొలుత చీఫ్ వార్డెన్ జారీ చేసిన నోటీసు ఫేక్ అని ప్రకటించాలనే యోచన చేసినట్లుగా విశ్వసనీయ సమాచారం. కానీ అప్పటికే సోషల్ మీడియాలో అంతా వైరల్ కావడం, విద్యుత్ శాఖ అధికారులు స్పందించడంతో సీన్ రివర్స్ అయింది. చీఫ్ వార్డెన్ డాక్టర్ కొర్రెముల శ్రీనివాస్‌ను 'నమస్తే తెలంగాణ' సంప్రదించగా... అన్ని యూనివర్సిటీల్లో సెమిస్టర్ పరీక్షల అనంతరం వేసవి సెలవులు ఇవ్వడం సాధారణమేనన్నారు. ఓయూలోనూ ఎన్నో ఏళ్లుగా ఇదే రీతిన నోటీసు ఇస్తామన్నారు. అన్ని హాస్టళ్లలో విద్యుత్, ఇతర మరమ్మతు పనులు చేయాల్సి ఉంటుందని, ఆ నేపథ్యంలో సెలువులు ఇచ్చామని వివరించారు. నోటీసులో కొన్ని క్లరికల్ తప్పిదాలు దొర్లాయని చీఫ్ వార్డెన్ చెప్పడం గమనార్హం. క్లరికల్ తప్పులంటే సాధారణంగా అక్షరాలు తప్పు పడతాయేగానీ.. మొత్తం భావమే తప్పుగా ఉంటే దానిని క్లరికల్ తప్పిదంగా చెప్పడంపై విద్యార్థులు మండిపడుతున్నారు.

తాగునీటి కొరత అవాస్తవం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఉస్మానియా యూనివర్సిటీలో విద్యుత్తు, తాగునీటి కొరత ఉందంటూ చీఫ్ వార్డెన్ తప్పుడు ప్రకటన చేశారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఓయూలో విద్యుత్, తాగు నీరు కొరత అంటూ కొంతమంది ప్రకటనలు ఇవ్వడం, సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో విచారణకు ఆదేశించినట్టు తెలిపారు. వెను వెంటనే విచారణ చేసిన అధికారులు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని ప్రాథమిక నివేదికలో స్పష్టం చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. తాగు నీరు, విద్యుత్ కొరత మూలంగా మే ఒకటి నుంచి, 31 మే వరకు ఓయూ హాస్టల్స్, మెస్‌లు మూసి వేసున్నట్టు చీఫ్ వార్డెన్ ఒక ప్రకటన చేశారని, దీంతో విద్యార్థుల్లో ఆందోళన మొదలైనట్టు గమనించి ప్రభుత్వం వెంటనే తగు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. వాస్తవాలు ధృవీకరించుకోకుండా తప్పుడు ప్రకటన చేసిన చీఫ్ వార్డెన్‌కు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ద్వారా షోకాజ్ నోటీసు జారీ చేసినట్టు తెలిపారు. యూనివర్సిటీలో చదువుకునే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. విద్యుత్, తాగు నీటి సదుపాయాలను వెను వెంటనే పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించామన్నారు. విద్యార్థులు ఏమాత్రం ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని, నిశ్చింతగా యూనివర్సిటీలో ఉండి స్వేచ్ఛగా చదువుకోవచ్చన్నారు.

వీసీ.. వైస్ చైర్మన్!

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో కరెంటు, నీటి కొరత ఉందనే విషయం బయటపడిందనే ఆందోళనో.. లేదా ఒక్కసారిగా ప్రభుత్వం సీరియస్ కావడంతో జరిగిన తప్పిదమో! టీఎస్ఎస్పీడీసీఎల్ సికింద్రాబాద్ డివిజనల్ ఇంజినీర్ ఉస్మానియా వైస్ ఛాన్స్‌లర్‌కు సోమవారం లేఖ రాశారు. ఆయన రాసిన లేఖలో ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ బదులు వైస్ చైర్మన్ అని పేర్కొనడం విడ్డూరం.

తలసానితో కలిసి సనత్‌నగర్‌లో ఓటరుతో కరచాలనం చేస్తున్న పద్మారావుగౌడ్

నియోజకవర్గాన్ని విస్మరించిన కిషన్‌రెడ్డి

కిషన్‌రెడ్డిపై బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి టి.పద్మారావు గౌడ్ ఫైర్

సనత్‌నగర్ డివిజన్‌లో ఎమ్మెల్యే తలసానితో కలిసి పాదయాత్ర



అమీర్‌పేట్, ఏప్రిల్ 29: కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని పూర్తిగా విస్మరించారని బీఆర్ఎస్ అభ్యర్థి టి.పద్మారావు గౌడ్ అన్నారు. నియోజకవర్గాన్ని నిర్లక్ష్యం చేసిన కిషన్‌రెడ్డి ప్రజల నుంచే కాక సొంత పార్టీ శ్రేణుల నుంచి అసంతృప్తిని ఎదుర్కొంటున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు గౌడ్ సోమవారం ఉదయం మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి సనత్‌నగర్ డివిజన్‌లో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. కేవలం మతపరమైన అంశాల్లో ప్రచారాలు తప్పా బీజేపీ తమకు చేసిందేమీ లేదనే వ్యాఖ్యలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయన్నారు. తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పై ప్రజల్లో ఉన్న భ్రమలు తొలగిపోతున్నాయని చెప్పారు. ఆ పార్టీ పట్ల ప్రజలు తిరస్కరణ భావంతో ఉన్నట్టు తన పాదయాత్రలో ప్రజల మనోభావాలను గమనిస్తే తెలుస్తోందన్నారు. దశాబ్ద కాలంలో చోటు చేసుకున్న గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధి కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ సర్కార్ చలవేనని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పట్ల ప్రజల్లో ఆదరణ తగ్గలేదన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానాన్ని బీఆర్ఎస్ భారీ మెజార్టీతో గెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి, మేడే రాజీవ్‌సాగర్‌లతో పాటు కార్పొరేటర్ కొలను లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెయిర్‌సెలూన్‌లో కటింగ్ చేస్తూ బీఆర్ఎస్‌కు ఓటువేయాలని కోరుతున్న మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

మల్కాజిగిరిలో 'రాగిడి'ని గెలిపించుకుందాం

మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

జవహర్‌నగర్, ఏప్రిల్ 29: మల్కాజిగిరి పార్లమెంట్‌లో రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ మేయర్ మేకల కావ్యతో కలిసి పార్టీ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సోమవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలు చూస్తుంటే సంతోషంగా ఉందని, శాసనసభ ఎన్నికల్లో కనిపించిన జోరునే.. పార్లమెంట్ ఎన్నికల్లోనూ కనబర్చాలని సూచించారు. రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధే కనిపిస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. పలు డివిజన్‌లలో ప్రచారం చేస్తూ.. బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జిట్టా శ్రీవాణిశ్రీనివాస్‌రెడ్డి, మేక లలితాయాదవ్, సంగీతారాజశేఖర్, సతీశ్‌కుమార్, నాయకులు సుధాకర్‌చారి, సింగన్న బాల్‌రాజ్, ప్రకాశ్, సాధిక్, ప్రసాద్‌గౌడ్, సోషల్ మీడియా కన్వీనర్ అహ్మద్‌పాషా, మహిళలు పాల్గొన్నారు.

ఇదెక్కడి మార్పు బాబోయ్!

నీటి ఎద్దడి, కరెంటు కోతలతో విసిగిపోతున్న గ్రేటర్ జనం

కేసీఆర్ ప్రభుత్వ హయాన్ని గుర్తు చేసుకుంటున్న ఓటర్లు

కేసీఆర్ ప్రజల్లోకి వెళ్లడంతో మారిన గ్రేటర్ రాజకీయ ముఖచిత్రం

సిటీబ్యూరో, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): అలవి కానీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజాగ్రహం పెల్లుబికుతోంది. బస్తీల్లో ఉండే నిరుపేద మొదలు వ్యాపారవేత్తలు, రియల్ ఎస్టేట్ రంగ నిపుణులు, విద్యార్థులు, మహిళలు.. ఇలా సబ్బండ వర్గాల ప్రజలు రేవంత్ సర్కారును తీవ్రంగా వ్యతిరేతికిస్తున్నారు. ఇదేం పాలన..ఇదేమి మార్పు బాబోయ్ అంటూ ఈసడించుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే గత పదేండ్లలో స్థిరమైన ప్రభుత్వం – సమర్థవంతమైన నాయకుడిగా కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారు. గడిచిన నాలుగు నెలలుగా కొత్త ప్రభుత్వ పాలనపై వేచి చూసే ధోరణిలో కనబడిన ప్రజలు.. పార్లమెంట్ ఎన్నికలు ఒకవైపు..మరోవైపు తాగునీటి ఎద్దడి, కరెంట్ కోతలతో కష్టాలు, నిలిచిన అభివృద్ధి పనులు..ఆమడ దూరంలో సంక్షేమ ఫలాలు వెరసి..ప్రజలు ఒక్కసారిగా నిరసన గళం వైపు అడుగులు వేశారు. ఇదే విషయాన్ని రోజుకో చోట ప్రభుత్వంపై జరుగుతున్న నిరసనలు, సోషల్ మీడియా వేదికగా వ్యతిరేకత, ప్రచార పర్వంలోకి వెళుతున్న సందర్భాల్లో అభ్యర్థుల ప్రజా స్పందనలే కాంగ్రెస్ పాలనపై వ్యతిరేకతకు అద్దం పడుతున్నాయి.

కేసీఆర్ ప్రజల్లోకి వెళ్లడంతో మారిన రాజకీయ ముఖచిత్రం

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఏదో చేస్తుందని ఎదురుచూసిన జనాలకు షాక్‌ల మీద షాక్‌లు ఇస్తున్నది. ఇదే సమయంలో కొత్త ప్రభుత్వంపై కొన్నాళ్లు సర్దుకునే అవకాశం ఇచ్చిన ప్రతిపక్ష పార్టీ.. కొన్ని రోజులుగా రైతాంగం తీవ్రంగా నష్టపోవడం, కరెంట్ కోతలు, నీటి ఎద్దడి అధికం కావడంతో బాధ్యతగల ప్రతిపక్ష నేతగా బస్సు యాత్రతో గులాబీ పార్టీ అధినేత కేసీఆర్ ప్రజల్లోకి రావడం.. జనం స్పందన చూస్తున్న తీరుతో రాజకీయ ముఖచిత్రమే కాదు, అసలైన ప్రజాస్పందన బయటకు వచ్చింది. గత పదేండ్లలో హైదరాబాద్ నగరం ప్రతి రంగంలోనూ వృద్ధిని నమోదు చేసుకుందని, ముఖ్యంగా అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు అతి తక్కువ సమయంలోనే వచ్చేవని పెట్టుబడిదారుల్లోనూ విస్తృత చర్చ జరుగుతున్నది. గడిచిన ఐదు నెలల కాంగ్రెస్ పాలనలో నిర్మాణ రంగం కుదేలైందని రియల్ ఎస్టేట్ రంగ నిపుణులు వాపోతున్నారు.

కరెంట్ పోతే.. కాంగ్రెస్ వచ్చిందంటున్నారు?



కరెంట్ పోతే చాలు.. కాంగ్రెస్ గవర్నమెంట్ వచ్చిందన్న చర్చ గ్రేటర్ జనాల్లో హాట్ హాట్ చర్చకు దారి తీస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వంలో రెప్పపాటు కూడా కరెంట్ పోలేదని, హైదరాబాద్‌లో విద్యుత్ సరఫరాను దేశమే అబ్బురపడేలా మెరుగుపరిచారని చెప్పుకుంటున్నారు. ఉమ్మడి పాలనలో అపార్టుమెంట్లకు పోతే ఇన్వర్టర్లు ఉండేవని, పరిశ్రమలే బంద్ అయ్యే పరిస్థితి ఉండేదని.. మళ్లీ ఆనాటి పరిస్థితులే ప్రస్తుతం దర్శనమిస్తున్నాయని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలల్లోనే కరెంటు కోతలు లేని రాష్ట్రంగా కేసీఆర్ తీర్చిదిద్దితే.. నిరంతర విద్యుత్‌ను అందించారని చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంటు కోతలు స్పష్టంగా కనిపిస్తున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ చుట్టూ పవర్ హైల్యాండ్‌ను ఏర్పాటు చేసి, విద్యుత్‌ను ఉత్పత్తి చేసే చోటు నుంచి సరఫరా నిలిచిపోయినా మరో ఉత్పత్తి కేంద్రం నుంచి సరఫరా జరిగేలా నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసిన విషయాన్ని నగర వాసులు చెబుతున్నారు.

ఇదేం నీటి ఎద్దడి ?

తాగునీటి ఎద్దడిపై ప్రజలు మండిపడుతున్నారు. ఎండాకాలం వచ్చిందంటే చాలు ఖైరతాబాద్ జలమండలి ఎదుట ఖాళీ కుండల ప్రదర్శనలు, ప్రతిపక్ష పార్టీల నిరసనలతో దద్దరిల్లే పరిస్థితి నుంచి కేసీఆర్ పాలన నీటి కష్టాలకు చరమగీతం పాడిందన్నారు. గత ప్రభుత్వం పెరుగుతున్న జనాభాకు తగ్గట్లుగా రెండు జీవ నదులు కృష్ణా, గోదావరి జలాలను నగరానికి తరలించి నీటి ఎద్దడిని దూరం చేసిన సందర్భాలు ఉన్నాయని ప్రజలు చెబుతున్నారు. ప్రస్తుతం వాటర్ ట్యాంకర్ మూడు రోజులైన దొరికే పరిస్థితి లేదని వాపోతున్నారు. బస్తీల్లో వాటర్ ట్యాంకర్ వస్తే పానీ పాట్లు తప్పడం లేదని, అరకొర వాటర్‌తో ఇబ్బందులు పడుతున్నామంటూ ప్రజలు చెబుతున్నారు. మొత్తంగా కాంగ్రెస్ తెచ్చిన మార్పుతో ప్రజల కష్టాలు అధికమయ్యాయని, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో పట్టణ ప్రజలతో పాటు రూరల్ ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హాట్ హాట్ చర్చ గ్రేటర్ జనాల్లో జరుగుతున్నది.

తాగునీటికి ఇబ్బందులు రావద్దు

అధికారులకు జలమండలి ఎండీ ఆదేశాలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): తాగునీటి ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కరించాలని ఎండీ సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఖైరతాబాద్ ప్రధాన కార్యాలయంలో జలమండలి ఓ అండ్ ఎం అధికారులతో ఎంసీసీ (మెట్రో కస్టమర్ కేర్) ఫిర్యాదులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జలమండలి ఎండీ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో అధికారులు సొంతంగా ప్రణాళికలు వేసుకొని ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. తాగునీటి సరఫరా, కలుషిత నీటి సమస్యలపై వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మరోవైపు రోడ్లపై సీవరేజీ ఓవర్ ఫ్లో కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని ఎండీ అధికారులను ఆదేశించారు. ఎస్టీపీ పనుల పురోగతిపై ఎండీ సమీక్షించారు. ఎస్టీపీల పనులను పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. నిర్మాణ దశలో ఉన్న ఎస్టీపీల్లో కార్మికుల సంఖ్యను పెంచి పనులను పూర్తి చేసి ట్రయల్ రన్‌కు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఈడీ డాక్టర్ ఎం. సత్యనారాయణ, డైరెక్టర్లు శ్రీధర్ బాబు, అజ్మీరా కృష్ణ, స్వామి పాల్గొన్నారు.